నవనవలాడే కొన్ని కాకరకాయలని కోసి తెచ్చాడు. గురువు ఒకటి కొరుక్కుని తిని ఇంకోటి శిష్యుడి చేతిలో వుంచాడు.

శిష్యుడు దాన్ని కొరగ్గానే నోరంతా చేదు మయం అయిపోయింది. అయినా శిష్యుడు గురువు ఇచ్చిన కాకర కాయలన్నిటిని అభ్యంతరం చెప్పకుండా తిన్నాడు.

"ఉమ్మేస్తావనుకున్నాను. నీకవి చేదుగా లేవూ?" అడిగాడు గురువు.

"స్వామి! నిత్యం మీరు ఎంతో రుచికరమైన పదార్థాలని పెడుతున్నారు. ఈ ఒక్క రోజు చేదు కాకరకాయలని ఇస్తే ఎలా ఉమ్మగలను?" అడిగాడు శిష్యుడు.

"ఇదే సత్యాన్ని నువ్వు దేవుడి విషయంలో కూడా అన్వయించుకో. దేవుడిచ్చే సుఖాలని ఆనందంగా అనుభవిస్తాం కాని కష్టాలని ఇచ్చినప్పుడు ఆయన్ని నిందిస్తాం. కష్టాలని కూడా ఆయన ప్రసాదంలా భావించి స్వీకరించాలి." బోధించాడు గురువు.

## 105. సంస్కారాలు

ఓ రాజుగారికి ఓ సారి ఓ అనుమానం వచ్చింది. మనుషులంతా ఒక్కటే ఐనా ఓ సందర్భంలో ఒక్కలాగే ఎందుకు ప్రవర్తించరు? ఓ సందర్భంలో ఒకరికి కోపం వస్తే, ఇంకొకరికి నవ్వు వస్తుంది. మరొకరికి దుఃఖం వస్తే ఇంకొకరికి ఆనందం కలుగుతుంది. ఎందుకీ తేడా?

రాజధాని బయట వున్న సెలయేరు పారే ఓ అడవిలో వున్న కొండగుహలో తపస్సు చేసుకునే ఓ ఋషి దగ్గరకి వెళ్ళి తన అనుమానాన్ని తీర్చమని అడిగాడు. అందుకా ఋషి చిన్నగా నవ్వి జవాబు చెప్పాడు.

"చిన్న మైనం ముక్కని, మాంసం ముక్కని, కొద్ది తడి ఇసకని, గుప్పెడు బురదని, కొద్ది రంపం పొట్టుని తీసుకుని వాటిని నిప్పులో వేసి చూడు. అన్నీ ఒకే చోట వున్నా మైనం కరుగుతుంది. మాంసం రుచిగా

కాలుతుంది. తడి ఇసుక ఎండుతుంది. బురద గట్టిపడుతుంది. రంపం పొట్టు మండిపోతుంది. ఇవన్నీ వాటి వాటి ధర్మాలని అనుసరించి ప్రవర్తిస్తాయి. అలాగే ఏ సందర్భంలోనైనా మనుషుల చెడు లేదా మంచి సంస్కారాలు బయటపడతాయి. మన సంస్కారాల ద్వారా మనం చేసే కర్మలే మనల్ని స్వర్గానికి, లేదా నరకానికి చేర్చేవి. మరణానంతరం మనిషి గమ్యాన్ని నిర్ణయించేవి కూడా అవే. కాబట్టి చెడు సంస్కారులు నరకానికి వెళ్ళకుండా వుండటానికి గాను, బ్రతికి వున్నప్పుడే వాటిని వదిలించుకోవాలి. నరకానికి వెళ్ళకుండా కాపాడే మంచి సంస్కారాలు అలవర్చుకోవాలి."

## 106. చెడు కోసం మంచి

హైద్రాబాద్‌లోని ఇద్దరు బ్రాహ్మణులకి ఆస్త్మా వ్యాధి వుంది. చేప మందు తింటే ఆ రోగం నయం అవుతుందని వాళ్ళిద్దరూ విన్నారు. అయితే ఇద్దరూ పూర్తిగా శాకాహారులు. ఒకడు చేపని మింగడం విషయంలో సంశయించాడు. ఇంకొకడు తన మీద ఆధారపడ్డ భార్యా పిల్లలు తను ఇంకా క్షీణిస్తే ఇబ్బందికి గురవుతారని వెళ్ళి ఆ చేప మందుని మింగాడు. దాంతో అతని ఆస్త్మా పోయింది.

పాపభీతి గల రెండోవాడు చేపమందుని తినకపోవడంతో ఆ రోగం అధికం అయి ఓ తెల్లవారుఝామున ఊపిరాడక మరణించాడు. అతని భార్యా పిల్లలు అనాధలై అనేక కష్టాలకి గురయ్యారు.

మంచిపని కోసం కొంత చెడు చేసినా పాపం కాదు. కాని చెడు కోసం చేసే ప్రతీ మంచి పనీ పాపమే అవుతుంది.

## 107. పాదుకల విలువ

ఓ రాజుగారికి ఓ రోజు ఓ సందేహం వచ్చింది. తన గురువుని కలిసి అడిగాడు.